క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



రాయపర్తి: మండలంలోని కేశవాపురం జింకు రాంతండాకు చెందిన మాలోతు ప్రశాంత్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీమా ఉండడంతో రూ.2 లక్షల చెక్కు మంజూరు కాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాబు



వర్ధన్నపేట: పట్టణకేంద్రంలోని 3వ డివిజన్‌కు చెందిన బరిగెల బాబు దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దళితుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని, తన నియామకానికి సహకరించిన డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి చల్లా మదన్, జిల్లా అధ్యక్షుడు కొండేటి రాంచంద్రులకు బాబు కృతజ్ఞతలు తెలిపారు.

సైకాలజిస్ట్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

సంగెం: మండలకేంద్రంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రామచంద్రం మాట్లాడుతూ టీపీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ తరగతులు, ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్, మురళీధర్‌రావు, జిల్లా అధ్యక్షుడు మిథున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నర్సంపేట వాసి



నర్సంపేట రూరల్ : సోనుసూద్ ఫౌండేషన్ నేషనల్ కోఆర్డినేటర్, నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామానికి చెందిన శీలం భాను ప్రసాద్‌గౌడ్ ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సీఎంను శాలువాతో సన్మానించి, పూల బొకేను అందించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నర్సంపేట: నర్సంపేట డిపో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రీజియన్ కార్యదర్శి కే డీ రెడ్డి, రీజియన్ నాయకులు హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా మోహనాచారి, గౌరవ అధ్యక్షుడిగా ఏపీ.రావు, అధ్యక్షుడిగా ఏఎం.రావు, కార్యదర్శిగా ఎల్ఎస్‌రావు, సహాయ కార్యదర్శిగా కె.జనార్దన్, ఉపాధ్యక్షులుగా డిపి.రాజు, ఎస్.రాజేశ్వర్, కేఎస్.రావు, జి.వెంకటేశ్వర్లు, వీఎస్.రెడ్డి, డి.రమేష్, కోశాధికారిగా కెఎస్.రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా షాబుద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నివాళి



రవీందర్ (ఫైల్)

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన లైన్‌ఇన్‌స్పెక్టర్ ఆకుల రవీందర్ (55) ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య జమున, కుమార్తె దివ్య, కుమారుడు దినేష్ ఉన్నారు. విద్యుత్ శాఖ నర్సంపేట డీఈ సదానందం, ఏడీ ఐలయ్య, ఏఈ జోగానంద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ననుమాస కర్ణాకర్, పోలెపల్లి భిక్షపతి, బండారి సత్యం, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, రాంరెడ్డి, సర్పంచ్ కుండె మల్లయ్య, సాంబయ్య, భద్రయ్య, వెంకటేష్, డివిజన్‌లోని విద్యుత్ అధికారులు పరామర్శించారు.

డ్రిప్ పరికరాలు అందని ద్రాక్షే!

- రాయితీని నిలిపివేసిన గత ప్రభుత్వం
- ఆయిల్‌పామ్ పంటకే పరిమితం
- కాంగ్రెస్ సర్కారుపై రైతుల ఆశలు
- పరికరాల కోసం 3,700 దరఖాస్తులు





డ్రిప్

చెన్నారావుపేట : తక్కువ నీటిని ఉపయోగించి ఎక్కువ విస్తీర్ణంలో పంటలను వేసేందుకు ఉద్దేశించిన బిందు (డ్రిప్) సేద్యం పథకాన్ని గత ప్రభుత్వం నీరుగార్చింది. రాయితీపై అందించే పరికరాల కోసం 2018 నుంచి జిల్లాలోని వేలాది మంది రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో డ్రిప్‌కోసం 3,700 మంది 3,800 హెక్టార్లలో వ్యవసాయం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

సబ్సిడీ ఇలా..

తక్కువ నీటితో మొక్కజొన్న, మిర్చి, నిమ్మ, ఆరుతడి, పండ్లు, కూరగాయల తదితర పంటల సాగు కోసం డ్రిప్‌లు అందించేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరేళ్ల నుంచి డ్రిప్‌కు సబ్సిడీ అందించడం లేదు. బీఆర్ఎస్ కన్నా ముందు ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 సబ్సిడీ, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇచ్చాయి. పెద్ద రైతులను 12 ఎకరాలకు పరిమితం చేసి 80 శాతం వరకు సబ్సిడీ ఇచ్చాయి. డ్రిప్ ద్వారా నీటి ఆదాతోపాటు ఎరువులు అందిస్తే కూలీల కొరత కూడా తగ్గుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్‌కే పరిమితం చేసింది.

ప్రైవేట్‌గా కొనుగోళ్లు

ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు నిలిపి వేయడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్‌గా కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రధానంగా మొక్కజొన్న, మిర్చి రైతులు డ్రిప్‌పై ఆధారంగా సాగు చేస్తున్నారు. గతంలో హెక్టారుకు 10 శాతం రైతులు చెల్లిస్తే 90 శాతం రాయితీతో ప్రభుత్వం పరికరాలు అందించేది. కానీ, ప్రభుత్వ సబ్సిడీ లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.70 వేలు ఖర్చు చేసి డ్రిప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రభుత్వం రాయితీపై డ్రిప్ పరికరాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నాం..



నేను రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. గతంలో ఇచ్చిన విధంగా సబ్సిడీ డ్రిప్ అందిస్తారని ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నా. ప్రభుత్వం నుంచి రాకపోవడంతో చాలీచాలని నీటితో పంటలు సాగు చేస్తున్నాం. కొత్త ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ అందిస్తే ఉన్న నీటితో పంటలు పండించుకుంటాం.

– ధరావత్ జయరామ్, రైతు,సూర్యాపేట తండా

సబ్సిడీపై డ్రిప్ అందించాలి



నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు డ్రిప్ అందిస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నీటి వృథా తగ్గుతుంది. రైతులకు కూలీల ఖర్చు తగ్గడంతో పాటు సాగు విస్తీర్ణం పెరుగుతుంది. పలు రకాల పంటలను డ్రిప్‌పై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నాం.

– గోపు శ్రీనివాస్‌రెడ్డి, రైతు, చెన్నారావుపేట

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

రాయపర్తి: మండలంలోని కొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2009–10 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పుడు బోధించిన ఉపాధ్యాయులను ఆత్మీయంగా సన్మానించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయుడు పిన్నింటి కిషన్‌రావు, ఉపాధ్యాయులు డి నర్సింహరావు, శ్రీహర్ష, ఎంఎస్ రావు, అంజయ్య, ఎండీ పాషా, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌చారి, శోభారాణి, శివప్రియ, రాజశ్రీ, సుజాత, మణిమాల, పూర్వ విద్యార్థులు వెంకటేష్, అజయ్, ప్రవీణ్, రవీందర్, రత్నాకర్, రాజు, సుధాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దర్గా ఉత్సవాలు



దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ఎస్సై పరమేశ్

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేటలోని గుండం చెరువు కట్టపై దర్గాలో ఉర్సు ఉత్సవాలు గత రెండు రోజులుగా వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం ఎస్సై జక్కుల పరమేశ్ ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. మండల ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సర్పంచ్ మోడెం విద్యాసాగర్, ఉత్సవాల నిర్వాహకుడు జబ్బార్, మత పెద్దలు పాల్గొన్నారు.

‘అతిథి’లో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీధర్, మహేందర్ రెడ్డి

హన్మకొండ: హనుమకొండ కేయూసీ – పెద్దమ్మగడ్డ రోడ్డులోని అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ) –327 టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లను ఆదివారం పంపిణీ చేసి అన్నదానం చేశారు. మహేందర్ రెడ్డి కుమారుడు అరుణ్, కోడలు ప్రియాంక దంపతుల కుమారుడు అర్కా రెడ్డి పుట్టిన రోజును అతిథి దివ్యాంగుల ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ ఈఈయూ –327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేయడంతో పాటు పండ్లు, దుప్పట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎస్ఈఈయూ –327 నాయకులు తులసి శ్రీమతి, మచ్చిక బుచ్చయ్య గౌడ్, దొనికెల సదయ్య, కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన ముచ్చర్లకు చెందిన తెలుకుంట్ల లక్ష్మి అంత్యక్రియలకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి.. రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు చిర్ర వీరస్వామి, శ్రీధర్, రాజేష్, బండా సాయిరెడ్డి, వెంకటేష్, శివ, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

పరకాల : పట్టణంలోని మాదారం గ్రామానికి చెందిన బొట్ల శ్రీలేఖ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి మదారం అభివృద్ధి కమిటీ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 50 కిలో బియ్యం ఉచితంగా అందించారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని కమిటీ చైర్మన్ పసుల నాగరాజు, సీపీఐ నాయకులు దుప్పటి సాంబయ్య తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నాగెల్లి సంతోష్, సలహాదారుడు దుప్పటి సదయ్య, గూడెల్లి సదన్‌కుమార్, మంద నాగరాజు, గూడెల్లి నాగేంద్ర, కుమార్, భద్రయ్య, రవి, కవిరాజ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల వాల్‌పోస్టర్ల విడుదల



హసన్‌పర్తి: ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు హనుమకొండ ఫాతిమానగర్‌లోని బాలవికాసలో నిర్వహించనున్న సెంట్రల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ మహాసభల వాల్‌పోస్టర్లను హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి పుల్లా అశోక్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జనగాం శ్రీను, శ్రీవాణి, లలిత, రాజు, భిక్షపతి, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నల్లబెల్లి : సమావేశంలో మాట్లాడుతున్న బాబు



గీసుకొండ: మాట్లాడుతున్న శంకరయ్య

నల్లబెల్లి: దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు అన్నారు. ఆ సంఘం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధికి మూలమైన కార్మికుల హక్కులను కాలరాస్తు మోదీ ప్రభుత్వం నాలుగు చట్టాలను తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొడిగె సమ్మయ్య, కడియాల మనోహర్, పల్లె రవి, ఇస్లావత్ నెహ్రూ, నరేష్, ఈర్ల రవిందర్ పాల్గొన్నారు.

16న బంద్‌ను జయప్రదం చేయాలి

పర్వతగిరి: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు పిలుపునిచ్చారు. స్థానిక రైతు వేదికలో ఆదివారం కార్మిక, కర్షక మండల సదస్సు నిర్వహించారు. . కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి యాకుబ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ రావుల రాజు, ఎండి.రహమాన్, తుంగ మహేష్, జంగా రమేష్, చిన్నపెల్లి కుమార్, రైతు సంఘం మండల కన్వీనర్ జంగా మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

గీసుకొండ: కేంద్రంలోని బీజేపీ సర్కారు అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని, ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో జాయింట్ ప్లాట్‌ఫామ్ అఫ్ ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు వీరగోని శంకరయ్య, చుక్క మొగిలి, కందికొండ కుమారస్వామి, బ్రహ్మాచారి, చల్లా నర్సింహారెడి, రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.

హమాలీలను వెల్ఫేర్ బోర్డులో చేర్చాలి

సంగెం: హమాలీలను వెల్ఫేర్ బోర్డులో చేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అన్నారు. మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యలను పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ దుపాకి రాజు, భవననిర్మాణ కార్మిక మండల గౌరవ అధ్యక్షుడు పాలబోయిన శ్రీనివాస్, వివిధసంఘాల నాయకులు కంది రవి, దేవుల రాజు, స్వామి, ప్రవీణ్, రమేష్, అనీల్, కుమారస్వామి, సురేష్, అశోక్, శంకర్ పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



విద్యారణ్యపురి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావును హనుమకొండలో మున్నూరుకాపు సంఘం బాధ్యులు ఆదివారం సన్మానించారు. మున్నూరుకాపు మాసపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా వైద్యవిభాగంలో ఉత్తమ అవార్డును ప్రకటించారు. ఈమేరకు ఆయనకు సన్మానించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కటకం పెంటయ్య, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు కసుకుంట్ల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బొరిగం నరసింగం, అలుగం ప్రభాకర్, మున్నూరుకాపు మాసపత్రిక వ్యవస్థాపకులు కోల జనార్దన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వాన్ని వ్యాప్తి చేస్తున్న కేతిరెడ్డి



రెండు ప్రేమల వాన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నర్సంపేట : కవిత్వాన్ని వ్యాప్తి చేస్తున్న కవి కేతిరెడ్డి యాకుబ్‌రెడ్డి అని శ్రీనివాసాచార్య అన్నారు. పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం యాకూబ్‌రెడ్డి రాసిన ‘రెండు ప్రేమల వాన’ పుస్తక సంపుటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకంలోని కవిత్వంలో మానవతావాదం, జీవన తాత్వికత మెండుగా ఉన్నాయన్నారు. ‘ఆమె’ అనే కవితలో జీవన సహచరిపై ఉండాల్సిన అనురాగ, బాధ్యతలను ఆయన ఎలా కవిత్వీకరించారో తెలిపారు. యాకుబ్‌రెడ్డి మాట్లాడుతూ బావుత, నిండు మానవజీవిత సారం ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. సున్నిత భావాల సమాహారం, సమాజాన్ని మేల్కొలిపే పలు అంశాలు ఈ కవిత్వంలో ఉన్నాయని పేర్కొన్నారు. సమాజ హితాన్ని కోరుకునేదే కవిత్వమని, అదే ఎక్కువ కాలం కొనసాగుతదని పేర్కొన్నారు. మనుషులను అర్థం చేసుకొని ముందుకు సాగించే కవి త్వం రావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత కంది గో పాల్‌రెడ్డి, ప్రముఖ వైద్యుడు వీఎం.జయుడు, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్‌రెడ్డి, గీతాంజలి విద్యా సంస్థల అధినేత సుబ్బారావు, కవులు రాజ్‌కుమార్, లీడ్ వ్యవస్థాపకుడు రవికుమార్, దయాకర్ కుమారస్వామి, ప్రేమ్‌కుమార్, జగదీష్, మహేందర్, కళ్యాణి, సుదర్శన్, శ్రీలేఖ సాహితి టి.రంగస్వామి, తండా హరీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌లో నీరు..!



గ్యాస్ సిలిండర్ నుంచి నీరు వస్తున్నట్లు చూపుతున్న వినియోగదారుడు

వర్ధన్నపేట: పట్టణ కేంద్రానికి చెందిన వ్యక్తి తాను బుక్ చేసుకున్న గ్యాస్ సిలిండర్‌లో నీరు వచ్చి వింత అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళితే.. ఆకుల సత్యం ఇండియన్ గ్యాస్ వినియోగదారుడు ఎప్పటి లాగే గ్యాస్ బుక్ చేశాడు. సంగెం మండలంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి నిండు సిలిండర్ వచ్చింది. ఈ సిలిండర్‌ను పొయ్యికి అనుసంధానం చేసి లైటర్‌తో వెలిగించి చూడగా ఎంతకూ పొయ్యి వెలగలేదు. దీంతో అసలు గ్యాస్ ఉందా లేదా అనే అనుమానంతో సిలిండర్‌ను పరిశీలించి చూశాడు. స్క్రూ డ్రైవర్ సాయంతో సిలిండర్ పైభాగంలో ప్రెస్ చేసి చూడగా నీరు వస్తున్నట్లు గమనించి ఆశ్చర్యపోయాడు. వినియోగదారులను ఇబ్బంది పెట్టే విధంగా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన ఇంధన సిలిండర్లు మాత్రమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు సంబంధిత గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

దుగ్గొండి: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా డిగ్రీ చదివిన పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ ఎన్నారై సెల్ ప్రతినిధి, మండల ఓటరు నమోదు ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గిర్నిబావిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 నవంబర్ వరకు డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు నమోదుకు అర్హులన్నారు. ఓటరుగా నమోదు చేయించుకోవాలనుకునే వారికి తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యాదగిరి సుధాకర్, కక్కెర్ల ప్రమోద్, పొగాకు బాలకృష్ణ, బొడిగె బాలకృష్ణ, మేకల రాజ్‌కుమార్, ఆమంచ లక్ష్మణ్, జోగ్యానాయక్, కోటి, రంజిత్‌కుమార్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న యాదగిరి

ఐనవోలు : ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దేవస్థాన మాజీ చైర్మన్, ప్రస్తుత నందనం సొసైటీ డైరక్టర్ వడిచర్ల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా ఏబీసీ నేషనల్ కో ఆర్డినేటర్ మధ్యప్రదేశ్ ఓబీసీ ఇన్‌చార్జ్ ఉల్లంగుల యాదగిరి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యాదగిరి వెంట ఓబీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పులి గణేశ్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు సంగి వెంకన్న, నల్లమాస రమేష్, మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి అలుగునూరి శ్రీను, మండల రజక సంఘం ఉపాధ్యక్షుడు గుడికందుల చంద్రయ్య ఉన్నారు.

ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి



సంతోషిని సన్మానిస్తున్న కరాటే ప్రభాకర్

ఖిలా వరంగల్: అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో టర్కీ, రష్యాల్లో వేర్వేరుగా జరిగిన పోటీల్లో ఓరుగల్లు క్రీడాకారిణి గోల్డ్‌మెడల్ సాధించడం అభినందనీయమని కిక్ బాక్సింగ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ కొనియాడారు. వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో క్రీడాకారిణి ఎం.సంతోషిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ఓరుగల్లు కీర్తి చాటడం హర్షణీయమన్నారు. మరోసారి ఫిబ్రవరి 7నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలల చాటాలని సూచించారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, షేక్ రియాజ్, కళ్లెపు సతీష్‌చంద్ర, శ్రీమాన్‌రెడ్డి, చెల్పూరి రాహుల్, సిరిగిరి తిరుపతి, క్రీడాకారిణి తల్లిదండ్రులు మధు, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

మినీ కల్చరల్ భవనం నిర్మించాలి

కాశిబుగ్గ: వరంగల్ పోచమ్మమైదాన్‌లో మినీ కల్చరల్ భవనం నిర్మించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కళాజాతా నాయకులు డిమాండ్ చేశారు. ఇండియన్ పీపుల్ థియేటర్ అసోసియేషన్ (ఐపీటీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సాగుతున్న కళాజాతా కాశిబుగ్గ జంక్షన్‌కు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం, సమన్యాయం, కళాకారుల సమస్యలపై, మూఢ విశ్వాసాలను వ్యతిరేకిస్తూ, శాంతి పర్యావరణ పరిరక్షణకు గత సెప్టెంబర్ 23న కళాజాతా ప్రారంభమైందని వివరించారు.